సాక్షి ఆదిలాబాద్

శనివారం । 23 । నవంబర్ । 2024



ఆమెకు 'భరోసా'.. 8లో ▸

మహిళలు, పిల్లల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. లైంగిక వేధింపులు, దాడులకు గురైన వారికి అండగా నిలిచేందుకు ప్రారంభించిన భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయి.

నేటి నుంచి సెలవులో కలెక్టర్

కైలాస్‌నగర్: కలెక్టర్ రాజర్షి షా వ్యక్తిగత సెలవుపై వెళ్లారు. ఈ నెల 23 నుంచి 25 వరకు సెలవులో ఉండనున్నారు. 26న తిరిగి విధుల్లో చేరుతారు. అయితే ఇన్‌చార్జి కలెక్టర్‌గా ప్రభుత్వం ఎవరికి బాధ్యతలు అప్పగించలేదు. కలెక్టర్ విధుల్లో చేరే వరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామలాదేవి పరిపాలన వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 28.0/13.0

రాత్రి వేళలో చలి తీవ్రత పెరగనుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షి షా



సర్టిఫికెట్ అందిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్: యువజన సర్వీసుల శాఖ, సెట్విన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని యూత్ ట్రెనింగ్ సెంటర్‌లో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అందించిన ఉచిత శిక్షణను పూర్తి చేసుకున్న వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేద యువత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మూడు నెలల పాటు 120 మంది యువత శిక్షణ పొందారని వెల్లడించారు. టైలరింగ్ నేర్చుకున్న వారు డ్వాక్రా గ్రూపులలో సభ్యులుగా చేరాలని సూచించారు. ఇందులో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూవో సబిత, ప్రిన్సిపాల్ రవీందర్, వైటీసీ ఇన్‌చార్జి బలరాం, లలిత, సాగర్, విశాల్, సునీల్ తదితరులున్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

కైలాస్‌నగర్: ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం- 2025లో భాగంగా జిల్లాలో ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువత జాబితాలో తమ పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫారం-6 ద్వారా ఓటరు నమోదు అలాగే ఫారం-7 ద్వారా అభ్యంతరాల స్వీకరణ, ఫారం-8 ద్వారా సవరణలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 29న ప్రకటించిన ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 28 వరకు దరఖాస్తులు అందజేయవచ్చని పేర్కొన్నారు. అభ్యంతరాలు, ఓటర్స్ క్లైయిమ్స్‌ను డిసెంబర్ 24లోగా పరిష్కరించి 6 జనవరి 2025న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు.

10న డాక్ అదాలత్

ఆదిలాబాద్: డాక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ సిద్దార్థరెడ్డి ఓ ప్రకటనలో కోరారు. పోస్టల్ సేవలకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారం కోసం డిసెంబర్ 10న ఉదయం 11గంటలకు గూగుల్‌మీట్ ద్వారా అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఫిర్యాదుదారులు ఈ నెల 30 లోగా హైదరాబాద్ రీజియన్ కార్యాలయంలో మొబైల్ నంబర్, ఈ మెయిల్ ఐడీ చిరునామాతో దరఖాస్తు సమర్పించాలని సూచించారు.

డాటా ఎంట్రీ నమోదు షురూ




తాంసిలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీ ప్రక్రియ జిల్లాలో శుక్రవారం ప్రారంభమైంది. దాదాపు అన్ని మండలాల్లోనూ ఆపరేటర్లు సమాచార నమోదు ప్రక్రియ ప్రారంభించారు. తొలిరోజున జిల్లా వ్యాప్తంగా 620 ఫారాలకు సంబంధించిన సమాచారాన్ని సర్వే వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియను ఆయా మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పర్యవేక్షించారు. కాగా శనివారం నుంచి ఈ ప్రక్రియ వేగవంతమయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

లంచావతారులు..!

- ఉన్నతాధికారులే సూత్రదారులుగా..
- సిబ్బందిని పురమాయిస్తూ బేరసారాలు
- స్థాయిని బట్టి అక్రమాల్లో వాటాలు
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ఏసీబీ కేసులు



సాక్షి, ఆదిలాబాద్: కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఓ రోడ్డు నిర్మాణానికి సంబంధించి నిర్వాసితులకు అక్కడి భూ విలువ కంటే ఎక్కువ మొత్తంలో పరిహారం వచ్చేలా రెవెన్యూ అధికారులే చక్రం తిప్పారు. అందులో తమకు వాటా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంలో అప్పట్లో ఆర్డీవోగా ఉన్న సిడాం దత్తు, డిప్యూటీ తహసీల్దార్ మేస్రం నాగోరావు, మండల సర్వేయర్ జె.భరత్ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారు. మరో నలుగురు ప్రైవేటు వ్యక్తులను భాగస్వామ్యం చేసుకుని వ్యవహారం నడిపారు. మొత్తంగా ప్రభుత్వ నిధులను స్వాహా చేసి సర్కారుకు నష్టం కలిగించారు. దీనిపై ఆరోపణలు రావడం, కొంత మంది ఫిర్యాదు చేసిన క్రమంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఇందులో భాగస్వాములైన వారిని అరెస్టు చేసింది. ఇలా ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులే తమ హోదాలను విస్మరించి అక్రమాలకు పాల్పడుతున్నారు. తలా పాపం.. తిలా పిడికెడు.. అన్న రీతిలో ఆ శాఖలోని కిందిస్థాయి సిబ్బందిని కూడా భాగస్వాములుగా చేస్తున్నారు. వారి స్థాయికి తగ్గట్లుగా ఆ అవినీతిలో వాటాలు ఇస్తున్నారు. కొన్నింట్లో మాత్రమే బాధితులు బయటకు వచ్చి ఏసీబీకి పిర్యాదు చేయడంతో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇలా అనేకంగా జరుగుతున్నప్పటికీ తమ పని జరిగిపోతే సరేలే అనుకుని పలువురు ఏసీబీని ఆశ్రయించడం లేదు. దీంతో ప్రభుత్వ శాఖల్లో అవినీతికి చెక్‌పడటం లేదు.

ఈ శాఖల్లో అధికం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ఏడాది 10 ఏసీబీ కేసులు నమోదు అయ్యాయి. మరో మూడు తనిఖీ కేసులు చోటు చేసుకున్నాయి. ఏసీబీ కేసులను పరిశీలిస్తే.. రెవెన్యూ, మున్సిపల్ శాఖకు సంబంధించి చెరో మూడు చొప్పున కేసులు నమోదు కాగా మిగతా పంచాయతీరాజ్, వ్యవసాయ, ఇరిగేషన్‌తో పాటు పోలీసు శాఖల్లో అవినీతి అక్రమాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. వీటిలో ఒకట్రెండు మినహాయిస్తే.. ఆ శాఖలోని కీలక బాధ్యతలో ఉన్న అధికారి తన కింద పని చేసే సిబ్బందితో కలిసే ఈ అక్రమాలకు పాల్పడటం గమనార్హం. ప్రధానంగా ఆ అధికారి సిబ్బందిని పురమాయించి బాధితుడి నుంచి లంచానికి సంబంధించి డబ్బుల విషయంలో బేరసారాలు సాగిస్తారు. తాను తెర ముందు కాకుండా వెనక ఉండి అక్రమ వ్యవహారాన్ని సాఫీగా సాగేలా చూస్తారు. ఇది బెడిసి కొట్టకపోతే తమ హోదా, స్థాయిని బట్టి లంచంను వాటాలుగా పంచుకుంటారు.

ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా నమోదైన ఏసీబీ కేసుల సంఖ్య..

సంవత్సరం	కేసులు
2022	6
2023	9
2024(నవంబర్ వరకు)	10+3 ఆకస్మిక తనిఖీలు

ఆరోపణల నేపథ్యంలో..

సాధారణంగా ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలపై, అవినీతి ఆరోపణలు వ్యక్తమయినప్పుడు అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) రెడ్ హ్యాండెడ్‌గా దాడి చేసి పట్టుకోవడం వంటి కేసులను మనం చూస్తుంటాం. అంతే కాకుండా తనిఖీలు కూడా ఈ శాఖ పరంగా చేపడుతుంటారు. కొన్నిసార్లు ప్రభుత్వం వివిధ శాఖల పరంగా ఒకేసారి రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు సైతం చేపడుతుంది. ఇటీవల సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఆహార నాణ్యతకు సంబంధించిన అనేక ఆరోపణలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ముథోల్ ఆశ్రమ బాలుర పాఠశాల, వేమనపల్లిలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో ఏసీబీ తనిఖీ చేపట్టింది. అంతే కాకుండా జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్టులో తనిఖీ చేసినప్పుడు లెక్కకు మించి డబ్బులు అధికంగా వచ్చాయి.

అక్రమాలకు ఆద్యం..

ముఖ్యంగా తహసీల్దార్లు భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వ్యవహారాల్లో అవినీతి చోటు చేసుకుంటుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ సరైన పత్రాలు లేకపోయినప్పటికీ ఆఫీసర్లు లంచం తీసుకుని యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇక పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ వంటి శాఖల్లో రోడ్డు నిర్మాణాలకు సంబంధించి ఎంబీ రికార్డు చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్ల నుంచి కమీషన్ వసూలు చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి వివిధ విషయాల్లో ప్రజల నుంచి అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇక పోలీసుశాఖలో స్టేషన్ బెయిల్ మంజూరు కోసం ఇన్‌స్పెక్టర్లు పెద్ద మొత్తం లంచం డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ శాఖలో భూములకు సంబంధించిన అనేక అక్రమాలకు అధికా రులే సూత్రదారులవుతున్నారు. వ్యవసాయ శాఖలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వీటి విక్రయాలకు సంబంధించి ఫర్టిలైజర్ దుకాణాల లైసెన్స్‌కు సంబంధించిన వాటిలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఇరిగేషన్ శాఖలో ప్రాజెక్టులు, చెరువుల నిర్మాణాల్లో ఎంబీ రికార్డు కోసం కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇటీవల నిర్మల్ మున్సిపాలిటీలో ఓ జూనియర్ అసిస్టెంట్ అదే కార్యాలయంలో పని చేసే ఓ సిబ్బంది రెగ్యూలరైజేషన్‌కు సంబంధించిన వ్యవహారంలో డబ్బులు తీసుకుంటూ పట్టుబడ్డాడు. ఇలా ప్రభుత్వ శాఖల్లో అక్రమాలకు అంతు లేకుండా పోయింది.

ఫిర్యాదుకు ముందుకు రావాలి



ప్రభుత్వ శాఖల్లో పనుల కోసం వెళ్తే లంచం డిమాండ్ చేసిన పక్షంలో బాధితులు నిర్భయంగా ముందుకు వచ్చి ఏసీబీకి ఫిర్యాదు చేయాలి. అయితే తమ పని ఎక్కడ నిలిచిపోతుందోనని పలువురు ఏసీబీని ఆశ్రయించేందుకు వెనకడుగు వేస్తున్నారు. అటువంటి వారి పని పూర్తయ్యేలా కూడా ఏసీబీ చొరవ తీసుకుంటుంది.

– రమణమూర్తి, ఇన్‌చార్జి డీఎస్పీ, ఏసీబీ, ఆదిలాబాద్ రేంజ్

సెస్.. అందట్లే

- సమస్యల్లో సరస్వతీ నిలయాలు
- బకాయిల చెల్లింపులో జాప్యం
- నిర్వహణకు తప్పని తిప్పలు
- స్థానిక సంస్థల నుంచి రూ.3కోట్ల వరకు పెండింగ్



జిల్లా కేంద్ర గ్రంథాలయం

ఆదిలాబాద్: స్వరాష్ట్ర సాధనలో భాగంగా తొలిదశ పోరాటంలో గ్రంథాలయోద్యమానిది కీలకపాత్ర. అప్పట్లో ఉద్యమకారులు ఊరూరా గ్రంథాలయాలు నెలకొల్పి తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం రగిలించారు. అయితే స్వరాష్ట్రంలో మాత్రం విజ్ఞాన భాండాగారాలు నిర్వహణ లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. సిబ్బంది కొరతతో పాటు పూర్తిస్థాయిలో పుస్తకాలు లేక ఉనికిని కోల్పోతున్నాయి. లైబ్రరీలు స్థానిక సంస్థల నుంచి ఆదాయాన్ని సమకూర్చుకుంటాయి. సెస్ రూపంలో గ్రంథాలయాలకు విధిగా చెల్లించాల్సి ఉంటుంది. వీటితోనే నిర్వహణ సాధ్యపడుతుంది. అయితే కొన్నేళ్లుగా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల నుంచి రావాల్సిన సెస్ బకాయిలు అందక లైబ్రరీల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోంది.

అందని సెస్..

సమాజాభివృద్ధిలో ఎంతో కీలకంగా వ్యవహరించే పుస్తకాల ప్రాధాన్యతను గుర్తించిన గత ప్రభుత్వాలు పౌరులు చెల్లించిన పన్నులో లైబ్రరీల అభివృద్ధి కోసం సెస్ చెల్లించాలనే నిబంధనలు పెట్టాయి. స్థానిక సంస్థలకు అందే ఆస్తి పన్నులో ప్రతీ రూపాయిలో 8 పైసలు సెస్ రూపంలో అందించాల్సి ఉంటుంది. దీనిని స్థానిక సంస్థలు ఎప్పటికప్పుడు చెల్లిస్తే లైబ్రరీలు ఆటంకం లేకుండా మనుగడ సాగిస్తాయి. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత వెరసి గ్రంథాలయాలకు శాపంగా మారుతుంది. సెస్ సంబంధిత బకాయిలు చెల్లించడానికి పలు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ విముఖత ప్రదర్శిస్తుండడంతో సరస్వతీ నిలయాలు సమాజంలో మొక్కుబడిగా కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి.

నిధులు లేక నిస్తేజంగా...

సెస్ నిధులే గ్రంథాలయాలకు ప్రధాన ఆదాయవనరు. వీటి ద్వారా మౌలిక వసతుల కల్పన, గ్రంథాలయ భవనాలకు మరమ్మతులు, నిర్వహణ, టాయిలెట్స్ నిర్మాణం, నూతన పుస్తకాల కొనుగోలు, ఆన్ డిమాండ్ బుక్స్ అందుబాటులో ఉంచడం వంటి వాటికి అవకాశం ఉంటుంది. తాగునీటి సౌకర్యం, విద్యుత్, పార్ట్‌టైం వర్కర్లకు కూలి, వస్తువుల కొనుగోలు వంటి వాటికి పలు సందర్భాల్లో ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలోని ఎన్నో గ్రంథాలయాలకు సొంత భవనాలు లేకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది. దాతల సహకారంతో రెంట్ ఫ్రీ భవనాల్లో లైబ్రరీలు నడుస్తుండడం వాటి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. సరైన సమయంలో బకాయిలు రాకపోవడంతో అరకొర నిధులు, దాతల సహకారంతో పాఠకులకు సౌకర్యాలు కల్పించాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గుదిబండగా మారిన బకాయిలు..

జిల్లా వ్యాప్తంగా 14 గ్రంథాలయాలు ఉన్నాయి. ఆదిలాబాద్ పట్టణంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉండగా, జిల్లాలోని 13 మండలాల్లో మండల గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణకు అవసరమైన సెస్ బకాయిలు రూ. 3కోట్ల వరకూ పెండింగ్‌లో ఉండడం గమనార్హం. ఇందులో మున్సిపాలిటీ నుంచి రూ. 2.95 కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉండగా, జిల్లాలోని గ్రామపంచాయతీల నుంచి రూ.14.58 లక్షల వరకు బకాయిలు అందాల్సి ఉంది. ఎప్పటికప్పుడు మున్సిపాలిటీ, జీపీ అధికారుల దృష్టికి బకాయిల చెల్లింపు విషయాన్ని తీసుకువెళుతున్నా, ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోతుందనే అసహనం గ్రంథాలయ అధికారుల నుంచి వ్యక్తం అవుతుంది.

డీసీబీ వివరాలు సరిగా ఇవ్వట్లే..

గ్రంథాలయ నిర్వహణ ముఖ్యంగా సెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. వేతనాలు మినహా మిగిలిన నిర్వహణ అంతా సెస్ ఆదాయం నుంచే ఖర్చు చేయాల్సి ఉంటుంది. మున్సిపాలిటీతో పోల్చితే గ్రామ పంచాయతీల నుంచి వసూలు విషయంలో ఇబ్బందులు ఉంటున్నాయి. అలాగే సంబంధిత అధికారులు డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ (డీసీబీ) వివరాలు కూడా సరిగా ఇవ్వట్లేదు. పూర్తిస్థాయిలో తెలియపరిస్తే సెస్ బకాయిల విషయంలో స్పష్టత వస్తుంది.

– బుగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

హెచ్చరించినా.. డోంట్ కేర్!

- భాగ్యనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్
- అధికారులు రంగంలోకి దిగినా పట్టించుకోని రియల్టర్
- బండరాళ్లు తొలగించినా మళ్లీ పాతిన వైనం



భాగ్యనగర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో అక్రమ లేఅవుట్లు జోరుగా వెలుస్తున్నాయి. నిబంధనలు పాటించని వాటి విషయమంలో మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నా పలువురు రియల్టర్లు పట్టించుకోవడం లేదు. బల్దియా అధికారులు వాటిలో బండరాళ్లను తొలగించినా వీరు మాత్రం తమ తీరు మార్చుకోవడం లేదు. డోంట్ కేర్ అంటూ వ్యవహరిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణం భాగ్యనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన అనుమతి లేని లేఅవుటే ఇందుకు నిదర్శనం.

బండరాళ్లను తొలగించినా...

భాగ్యనగర్ కాలనీలోని వాగు సమీపంలో సర్వేనంబర్ 25/2లో గల రెండెకరాల పంట చేనును ఓ రియల్టర్ గతంలో లేఅవుట్‌గా మార్చాడు. దీనికి మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి గాని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) నుంచి గాని ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా ఏర్పాటు చేసిన ఈ లేఅవుట్‌పై ఫిర్యాదులు రావడంతో ఇటీవల బదిలీపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బందితో కలిసి పోలీస్ బందోబస్తు నడుమ అందులో పాతిన బండరాళ్లను పూర్తిగా తొలగించి వేశారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంత వరకు బాగానే ఉండగా తాజాగా సదరు రియల్టర్ ఆ లేఅవుట్‌లోనే మళ్లీ పనులు ప్రారంభించాడు. బల్దియా సిబ్బంది తొలగించిన రాళ్లను తిరిగి పాతడంతో పాటు టిప్పర్ల సాయంతో మొరం తీసుకొచ్చి అంతర్గత మట్టిరోడ్లు ఏర్పాటు చేస్తుండడం గమనార్హం. గతంలో చర్యలు చేపట్టిన అధికారులు సైతం ప్రస్తుతం మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలేంటంటే...

సాధారణంగా లేఅవుట్ ఏర్పాటు చేయాలంటే మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అనంతరం లేఅవుట్ విస్తీర్ణంలో 15 శాతం భూమిని మున్సిపాలిటీకి మార్టిగేజ్ చేయాలి. ఇది పూర్తయ్యాకే లేఅ వుట్ పనులు ప్రారంభించాలి. 40 ఫీట్ల రోడ్లతో పాటు, విద్యుత్, డ్రెయినేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించాలి. కానీ ఈ లేవుట్‌లో అలాంటి సౌకర్యాలేమి కన్పించడం లేదు. అనుమతులేమి లేకుండా కేవలం మట్టి రోడ్లు వేసి ఒక్కో ప్లాటును రూ.15లక్షల నుంచి రూ.20లక్షలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే వీటిని కొనుగోలు చేసిన వారు భవిష్యత్తులో ఇంటి నిర్మాణానికి అనుమతులు లభించక, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పవు.

చర్యలు తీసుకుంటాం

భాగ్యనగర్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్ ముమ్మాటికి అక్రమమే. ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేయడంతోనే గతంలో అందులోని బండరాళ్లను తొలగించి వేశాం. మళ్లీ పనులు చేయడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. శాఖాపరంగా తగు చర్యలు తీసుకుంటాం. ప్లాట్లను కొనుగోలు చేసే ప్రజలు లేఅవుట్‌కు అధికారిక అనుమతులు ఉన్నాయా.. లేవా పరిశీలించుకోవాలి. లేదంటే ఇంటి నిర్మాణానికి అనుమతి లభించక ఇబ్బందులు తప్పవు.

– సుమలత, టీపీఓ, ఆదిలాబాద్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వందశాతం ప్రసవాలు జరిగేలా వైద్యులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు రెగ్యులర్‌గా వైద్యపరీక్షలు నిర్వహించుకునేలా ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. సామ్-మామ్ చిన్నారులపై శ్రద్ధ వహిస్తూ ఆరోగ్యవంతులుగా ఎదిగేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. గర్భిణులు స్థానిక ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ట్రెయినీ కలెక్టర్ అభిఘ్నాన్ మాల్వియా, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, డీఐవో వైసీ శ్రీనివాస్, జిల్లా సంక్షేమాధికారి సబిత తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌కు పెరుగుతున్న ఆదరణ



పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాలో అథ్లెటిక్స్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారన్నారు. ఇప్పటివరకు తొమ్మిది సార్లు జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోవడం నిదర్శనమన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, ప్రమోద్ కుమార్ ఖత్రి, రాకేశ్ తదితరులున్నారు.

గిరి గ్రామాల అభివృద్ధికి కేంద్రం కృషి

- ఎంపీ గోడం నగేశ్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌రూరల్: మారుమూల గిరిజన గ్రామాల్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని దివ్యగూడ, పాట్నంలొద్ది గ్రామాల్లో శుక్రవారం వారు పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆయా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, దయాకర్, స్వామి, ముకుందరావు, రాజు, తుకారాం, తదితరులున్నారు.

ప్రజాపాలన విజయోత్సవాలు



పోతురాజు వేషధారణలో కళాకారుడు



పీరీల ఊరేగింపు నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

కైలాస్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చేపట్టిన కళా యాత్ర శుక్రవారం ఆదిలాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను తమ ఆటపాటల ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రెయినీ కలెక్టర్ అభిఘ్నాన్ మాల్వియా, ఆర్డీవో వినోద్ కుమార్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చంపుతానని బెదిరించిన మాజీ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ కందిమళ్ల ఆదినారాయణకు చెందిన భూమిలో కూలీ పనులు నిర్వహిస్తున్న తమను చంపుతానని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బెదిరించినట్లు బట్వాన్‌పల్లికి చెందిన రామటెంకి శరణ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. శుక్రవారం మధ్యాహ్నం చిన్నయ్య, అతని డ్రైవర్ కృష్ణ, గన్‌మెన్‌లు కూలీ పనులు చేస్తున్న తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. నా భూమిలో మీరేం చేస్తున్నారు, ఇక్కడి నుంచి వెళ్లకపోతే చంపుతామని బెదిరించినట్లు శరణ్య తాళ్లగురిజాల స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్సై రమేశ్ వివరణ కోరగా ఫిర్యాదుపై విచారణ చేసి కేసు నమోదు అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్/వాంకిడి: యువతిని పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి లైంగికదాడికి పాల్పడిన కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. వాంకిడి ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. వాంకిడి మండలం తేజాపూర్‌కు చెందిన నగోష వినేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని మూడేళ్లుగా ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెను లొంగదీసుకుని పలుమార్లు లైంగికదాడి చేశాడు. పెళ్లి చేసుకోవాలని యువతి కుటుంబసభ్యులు వినేష్‌ను అడగగా నిరాకరించాడు. సదరు యువతి 2021 నవంబర్ 20న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈమేరకు తీర్పునిచ్చారు. నేరస్తుడు వినేష్‌కు శిక్షపడేలా చేసిన ప్రస్తుత ఆసిఫాబాద్ డీఎస్పీ కరుణాకర్, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఎస్సై ప్రశాంత్, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైజనింగ్ అధికారి రాంసింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు అభినందించారు.

పేలిన ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ

మంచిర్యాలక్రైం: ఒక ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి మరో రెండు బైక్‌లు దగ్ధమైంది. జిల్లా కేంద్రంలోని చింతపండువాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. అప్పని నాగరాజు ఇంటి ఎదుట వేరే వ్యక్తులు ఐదు బైక్‌లు రోజులాగా గురువారం రాత్రి పార్కింగ్ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఎలక్ట్రిక్ బైక్ బ్యాటరీ పేలి శబ్దం వచ్చింది. పక్కనే ఉన్న మరో రెండు బైక్‌లకు మంటలు అంటుకున్నాయి. నాగరాజు వెంటనే అప్రమత్తమై మరో రెండు బైక్‌లను అక్కడి నుంచి తొలగించాడు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు.

పెంచికల్‌పేట్‌లో వైల్డ్ డాగ్స్



పెంచికల్‌పేట్: జిల్లాలో అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్ శునకాలు ప్రత్యక్షమయ్యాయి. మండలంలోని మురళిగూడ అటవీ ప్రాంతంలోని చెరువు వద్ద శుక్రవారం మూడు ఇండియన్ వైల్డ్ డాగ్స్ నీరు తాగుతుండగా యువకులు కెమెరాలో బంధించారు. పెంచికల్‌పేట్ అటవీరేంజ్ పరిధిలో 10 వరకు ఏషియన్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని అధికారులు తెలిపారు.



ఆమెకు భరోసా..

- అభాగ్యులకు అండగా నిలుస్తూ..
- కౌన్సెలింగ్ చేస్తూ.. న్యాయ సహాయం అందిస్తూ..
- 52 జంటలను కలిపిన నిర్మల్ కేంద్రం



కౌన్సెలింగ్‌తో కలిసిన కుటుంబాలతో ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: మహిళలు, పిల్లల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. లైంగిక వేధింపులు, దాడులకు గురైనవారికి అండగా నిలిచేందుకు ఇంటిగ్రేటెడ్ సపోర్ట్ సెంటర్ ఫర్ ఉమెన్, చిల్డ్రన్(భరోసా) కేంద్రాలను నెలకొల్పింది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయగా గత ఫిబ్రవరి 18న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్, ఎస్పీ జానకీ షర్మిల ప్రారంభించారు. పోలీస్ శాఖ పర్యవేక్షణలో ఈ కేంద్రం నడుస్తోంది. అభాగ్యులు, బాధిత మహిళలు, బాలికలు, ఆపదలో ఉన్నవారికి తక్షణమే ప్రత్యేక సేవలు, న్యాయసహాయం లభిస్తోంది. సఖీ కేంద్రంలో బాధితులకు పునరావాసం కల్పిస్తోంది. ఇప్పటివరకు భరోసా ద్వారా ఏకమైన 52 జంటలను శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పోలీసు కుటుంబ సభ్యులు, వారితో కలిసి ఎస్పీ స్వయంగా భోజనం చేశారు.

అవగాహన కార్యక్రమాలు

జిల్లాలో తొలి మహిళా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నిర్మల్ పోలీస్..మీ పోలీసు అంటూ.. జానకీషర్మిల ప్రజలకు మరింత దగ్గరయ్యారు. పాఠశాల, కళాశాలలు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో భరోసా కేంద్రంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇప్పటివరకు భరోసా కేంద్రాన్ని 176 జంటలు ఆశ్రయించాయి. ఇందులో 52 జంటలను ఏకం చేసి వారి జీవితాల్లో వెలుగులను నింపారు.



పోలీసు కుటుంబ సభ్యులతో భోజనం చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

సేవలు ఇలా..

హింసకు గురైన పిల్లలకు భరోసా ఇస్తున్నాయి. మహిళలకు అత్యవసర, నాన్-ఎమర్జెన్సీ, వైద్య, చట్టపరమైన, మానసిక, కౌన్సెలింగ్ ఇస్తున్నాయి. ఈ కేంద్రంలో ఒక మహిళ ఇన్‌స్పెక్టర్, సైకాలజిస్టు, సపోర్టు పర్సన్, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్, న్యాయవాది, రిసెప్షనిస్టు ఉంటారు. లైంగిక దాడులు, ఇతర వేధింపులకు గురైన పిల్లలు మానసిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కేంద్రంలో సేవల నిర్వహణ తీరు ఉంటుంది. ఇక్కడ పోలీసుస్టేషన్ తరహా వాతావరణం ఉండదు. బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వైద్య సేవలు నిర్వహిస్తారు. వేగంగా న్యాయ సేవలందేలా ఇక్కడ న్యాయవాది ఉంటారు.

కౌన్సెలింగ్‌తో ఒక్కటయ్యాం



మాకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. ఒక పాప ఉంది. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. చాలా సందర్భాల్లో విడిపోవాలనుకున్నాం. భార్యతో ఉన్న వివాదంపై ఎస్పీ జానకీ షర్మిలను కలిసి వివరించాను. మా ఇద్దరిని భరోసా కేంద్రానికి పంపించారు. సుమంజలి మేడమ్ మూడుసార్లు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఒక్కటయ్యాం.

– కౌన్సెలింగ్‌తో ఏకమైన రమ్య, సురేశ్ దంపతులు, మామడ

జీవితంలో వెలుగులు

మాకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబంలో ప్రతీరోజు గొడవలతో భార్య పుట్టింటికి వెళ్లింది. మానసికంగా కుంగిపోయాను. ఒకసారి భరోసా కేంద్రాన్ని ఆశ్రయించాను. ఇద్దరికి మూడుసార్లు కౌన్సెలింగ్ ఇవ్వడంతో ఏకమయ్యాం. ప్రతి వారం ఫోన్ చేస్తూ..మేము ఎలా ఉన్నామని కనుక్కుంటారు. భరోసా కేంద్రం ఆశ్రయించడంతో తమ జీవితంలో వెలుగులు నింపిన పోలీసులకు ధన్యవాదాలు.

– లావణ్య, చరణ్ దంపతులు,సిర్గాపూర్

పోలీసులు అండగా ఉంటారు



బాధితులకు నిర్మల్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారు. బాధిత మహిళలు, యువతులు, బాలికలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. పాఠశాలల్లో పిల్లలకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు, పిల్లల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం. జిల్లా ప్రజలు ఏ సమయంలోనైన సంప్రదించవచ్చు. తాము కుటుంబానికి దూరంగా ఉంటున్నామని బాధ కన్నా, ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం అవుతున్నామన్న సంతోషం ఉంది.

– జానకీ షర్మిల, ఎస్పీ

ఒక్కటయ్యేలా చేసి..



మాకు ఐదు నెలల క్రితం పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాం. ప్రతీరోజు గొడవలు జరిగేవి. భార్య పుట్టింటికి వెళ్లింది. ఎస్పీని కలిసి వివరించాను. భరోసా కేంద్రానికి పంపించారు. ఎస్సై సుమంజలి, సిబ్బంది శిరీష.. జీవితంలో ఎలా బతకాలి, భార్యతో ఇలా నడుచుకోవాలనే అంశంపై కౌన్సెలింగ్ ఇచ్చారు. భార్యను మెప్పించి ఒక్కటయ్యేలా ఎస్పీ కృషిచేశారు.

– ప్రవీణ, నరేశ్ దంపతులు

విద్యార్థుల కోసమే వర్సిటీ దత్తత

- ఆర్జీయూకేటీని ఉత్తమంగా తీర్చిదిద్దుకుందాం
- ఎస్పీ జానకీషర్మిల



విద్యార్థులతో ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్‌కుమార్, వీసీ గోవర్ధన్

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీని ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వర్సిటీని దత్తత తీసుకుంటున్నామని ఎస్పీ జానకీషర్మిల అన్నారు.వర్సిటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆర్జీయూకేటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంపూర్ణ సహాయం, విద్యార్థుల సమగ్ర రక్షణ కోసం గొప్ప సంకల్పానికి పూనుకున్నట్లు తెలిపారు. విద్యార్థులు వారి లక్ష్యాలను చేరుకోవడంలో వారికి అవసరమైన మద్దతు, మార్గదర్శకత్వం అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. వర్సిటీని ఎస్పీ దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకు విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఏఎస్పీ అవినాష్‌కుమార్, వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్‌సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నగలు తాకట్టు.. ఖాతాలో జమకాని నగదు

- బెల్లంపల్లిలో ఘటన



బంగారం తాకట్టు పెట్టిన రశీదుపత్రం చూపిస్తున్న రాజేందర్

బెల్లంపల్లి: బంగారు నగలు తాకట్టు పెట్టిన వ్యక్తికి డబ్బులు బదిలీ కాకపోవడంతో కలకలం రేపింది. బెల్లంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. నెన్నెల మండలం మైలారం గ్రామానికి చెందిన బాధితుడు కొటారపు రాజేందర్ తెలిపిన వివరాలు.. అత్యవసరంగా డబ్బులు అవసరం ఉండి నాలుగు రోజుల క్రితం 14 తులాల బంగారు నగలను ముత్తూట్ మనీలో తాకట్టు పెట్టాను. రూ.7.35 లక్షలను నా వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా వెంటనే జమ చేస్తామని సిబ్బంది తెలిపారు. నాలుగు రోజులు గడిచినా నగదు జమ కాలేదు. కేవలం రూ.1 మాత్రమే రావడంతో ఆందోళనకు గురయ్యాడు. శుక్రవారం ముత్తూట్ మనీ కార్యాలయానికి వచ్చి ఆరా తీశాడు. సిబ్బంది పొంతన లేకుండా సమాధానం చెప్పారని, ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్య వల్ల డబ్బులు జమకాలేదని చెప్పినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈమేరకు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు.

ట్రిపుల్‌ఐటీని సందర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీని ఎమ్మెల్యే రామారావు పటేల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో సమస్యలు, ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమస్య ఉన్న విద్యార్థులు తనకు నేరుగా ఫోన్ చేయాలన్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రణధీర్‌సాగిలతో భేటీ అయ్యారు. క్యాంపస్‌లో విద్యార్థుల ప్లేస్‌మెంట్స్ గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కాగా, స్వాతి మృతిపట్ల విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో ఎమ్మెల్యే..ట్రిపుల్ ఐటీని సందర్శించారు.

ఉత్తమ ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రగతి చక్రం పురస్కారాలు పొందిన ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారికి ప్రగతి చక్రం పురస్కారాలు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం సంస్థ ప్రగతికి పాటుపడుతున్న ఉద్యోగుల సేవలు మర్చిపోలేనివన్నారు. ఎప్పటికప్పుడు సంస్థ లాభాల బాటపట్టేలా వారంతా కృషి చేస్తున్నారన్నారు. ప్రయాణికులందరికీ మెరుగైన సేవలు అందించేందుకు తోడ్పాటును ప్రగతి చక్రం పురస్కారాల రూపంలో వారికి తిరిగి అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం. ప్రణీత్, డిపో మేనేజర్లు కల్పన, జనార్దన్ విశ్వనాథ్, హరిప్రసాద్, పీవో జిబ్లా, ఏవో శంకరయ్య, ఎంఎఫ్ శ్రీకర్, రాజేంద్ర, శివదాస్, పోతారెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్య



దుక్రే రాందాస్ (ఫైల్)

జైనూర్: పంట దిగుబడి రాలేదని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. పట్నాపూర్ గ్రామానికి చెందిన రైతు దుక్రే రాందాస్(44) తన రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. దిగుబడి రాలేదని మనస్తాపం చెందాడు. గ్రామశివారులో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగి పడిపోయాడు. విషయం తెలుసుకున్న భార్య శకుంతల, మరిది దేవిదాస్‌లు అక్కడికి చేరుకుని అతన్ని ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో శుక్రవారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలానికి చెందిన వెంకటి (57) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లో వెళ్తే..ఆదిలాబాద్‌లోని విద్యానగర్ గల హనుమాన్ ఆలయంలో వెంకటి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఈయన సొరియాసిస్ వ్యాధితో బాధపడుతున్నా డు. చలి తీవ్రత పెరగడంతో బాధ తట్టుకోలేక గురువారం తిర్పెల్లి సమీపంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి బైండోవర్

జన్నారం: అక్రమంగా టేకు చెట్లు నరికివేతకు పాల్పడుతున్న మండలంలోని బాదంపల్లి గ్రామానికి చెందిన జాడి రాజంను తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. కొన్ని రోజులుగా అక్రమ కలప రవాణాలో సహాయపడుతున్నాడని తేలడంతో బైండోవర్ చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు.

ప్రతీకార హత్య కుట్ర.. భగ్నం

- నలుగురు నిందితుల అరెస్టు
- నాలుగు పిస్టోళ్లు, 18 రౌండ్ల మ్యాగ్‌జిన్స్, సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం
- నంద్యాలలో హత్య కోసం కాశీ నుంచి ఆయుధాల కొనుగోలు
- వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: ప్రతీకార హత్యకు పన్నిన కుట్రను భగ్నం చేసిన పోలీసులు.. నిషేధిత జనశక్తి దళం ఏర్పాటు ప్రక్రియను మొదట్లోనే తుంచేశారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం ఆదిలాబాద్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ గౌస్ ఆలం వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన మైల దిలీప్, నంద్యాలకు చెందిన అవులపాటి హిమకాంత్‌రెడ్డి ఉత్తరప్రదేశ్‌లోని కాశీ నుంచి నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజిన్స్, 18 లైవ్ రౌండ్స్ కొనుగోలు చేసి నంద్యాలకు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీసుస్టేషన్ పరిధి చాంద-టి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ గురువారం పట్టుకున్నారు. మరణాయుధాలు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని విచారించగా కుట్ర కోణం బయపడింది. ప్రధాన నిందితుడు నంద్యాలలోని సున్నిపెంటకు చెందిన వొట్టి వెంకట్‌రెడ్డి గతంలో జనశక్తి పార్టీలో పనిచేశాడు. ఇతడిపై రెండు టాడా కేసులు, వివిధ సంఘ విద్రోహ కేసులతోపాటు మూడు హత్య కేసులు, ఒక హత్యాయత్నం కేసు, నాలుగు జనశక్తికి సంబంధించిన కేసులు ఉన్నాయి. సూర్యాపేటకు చెందిన తన మిత్రుడు హత్యకు గురికావడంతో ప్రతీకార చర్యగా, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాలో మళ్లీ జనశక్తి దళం ఏర్పాటుకు నిర్ణయించుకున్నాడు. మరణాయుధాల కొనుగోలుకు నల్గొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నలగంటి ప్రసన్నరాజు ఆర్థికసాయం అందించాడు. వెంకట్‌రెడ్డి తన అనుచరుడైన హిమకాంత్‌రెడ్డి, మైల దిలీప్, అతడి రెస్టారెంట్‌లో పనిచేసే బీహార్‌కు చెందిన కుక్ భైరవ్‌లు కలిసి కాశీకి వెళ్లారు. అక్కడి నుంచి బీహార్‌లోని మ్యంగీర్ రైల్వేస్టేషన్‌లో పిస్తోల్, బుల్లెట్లు తీసుకున్నారు. భైరవ్ కాశీలోనే ఉండిపోగా వారిద్దరు బయలుదేరారు. నంద్యాలకు వెళ్లే క్రమంలో ఆదిలాబాద్ పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ ఇద్దరిని విచారించడంతో వెంకట్‌రెడ్డి, ప్రసన్నరాజుల కుట్రను వెల్లడించారు. గురువారం రాత్రి వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కుట్రకు సంబంధించి మొత్తం తొమ్మిది మంది నిందితులు ఉన్నట్లుగా గుర్తించారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేయగా మిగతా ఐదుగురు పరారీలో ఉన్నట్లుగా ఎస్పీ తెలిపారు. నాలుగు పిస్తోళ్లు, ఎనిమిది మ్యాగజైన్స్, 18 లైవ్ రౌండ్స్, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు ఫణీందర్, కరుణాకర్‌రావు, సాయినాథ్, ఎస్సై ముజాయిద్ పాల్గొన్నారు.

బాసరకు పోటెత్తిన భక్తజనం

బాసర: కార్తిక శుక్రవారం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీసూర్యేశ్వర ఆలయంలో పూజలు చేశారు. సరస్వతి అమ్మవారి, పరమేశ్వరుని ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగిస్తున్నారు. అనంతరం మహాలక్ష్మి, మహంకాళి, సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. తర్వాత చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు చేయించారు. కుంకుమార్చనలు చేశారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని అధికారులు వెల్లడించారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చిన్నారికి అక్షర శ్రీకారం చేయిస్తూ..



గోదావరి నది వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు..